భారతీయ జనతా పార్టీ - తెలంగాణ
BHARATIYA JANATA PARTY
Telangana

Dr. Shyamaprasad Mukherjee
Bhavan
Opp: Exhibition Grounds
Nampally, Hyderabad-500 001.

16-08-2018

# పత్రికా ప్రకటన

మాజీ ప్రధాన మంత్రి భారతరత్న శ్రీ అటల్ బిహారీ వాజ్‌పేయి మృతిపై బిజెపి తెలంగాణ దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. వారి మరణంపై బిజెపి రాష్ట్ర శాఖ ప్రగాఢ సానుభూతి ప్రకటించింది. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు డా॥ కె.లక్ష్మణ్ మీడియాతో మాట్లాడుతూ వాజ్‌పేయి మరణ వార్త బిజెపి కార్యకర్తలనే కాకుండా యావత్ దేశ ప్రజలను విషాదంలో ముంచిందన్నారు. గొప్ప మేధావి, అలుపెరుగని యోధుడైన వాజ్‌పేయి లేని లోటును పూడ్చలేమని ఆవేదన వ్యక్తం చేశారు.

పదవులెన్నడూ కాంక్షించని వాజ్‌పేయి దగ్గరికే ఎన్నో పదవులు వచ్చి చేరాయన్నారు. వాజ్‌పేయి మూడు పర్యాయాలు ప్రధానమంత్రిగా, 10 సార్లు లోక్‌సభ సభ్యుడిగా, రెండు సార్లు రాజ్యసభ సభ్యుడిగా బాధ్యతలు నిర్వర్తించారని తెలిపారు. తన హయాంలో వాజ్‌పేయి అనేక సాహసోపేత నిర్ణయాలు తీసుకున్నారని, దేశానికి ఒక దిశను నిర్దేశించారని స్పష్టం చేశారు. పోఖ్రాన్ పరీక్షలు, కార్గిల్ యుద్ధంలో విజయం లాంటి ఘనతలు ఆయన హయాంలోనే చోటుచేసుకున్నాయన్నారు. స్వర్ణ చతుర్భుజి, గ్రామీణ సడక్ యోజన, సర్వ శిక్ష అభియాన్, ఐటీ విప్లవం, టెలికాం విప్లవం వంటి అనేక విప్లవాత్మక సంస్కరణలు ప్రవేశపెట్టి దేశాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లారన్నారు. ఢిల్లీ-లాహోర్ బస్సు సర్వీస్, ఆగ్రా శిఖరాగ్ర సమావేశాలతో భారత్-పాక్ సంబంధాలను మెరుగుపర్చేందుకు విశేష కృషి చేశారన్నారు. కశ్మీర్‌పై వాజ్‌పేయి ఇచ్చిన నినాదాలు 'కశ్మీరియత్', 'జమూరియత్', 'ఇన్సానియత్' పార్టీలకు అతీతంగా కేంద్రంలో ఏ ప్రభుత్వం ఏర్పడినా కశ్మీర్ విషయంలో ఈ విధానాన్నే అనుసరించడం ఆయన దార్శనికతకు అద్దం పడుతుందన్నారు. సాంకేతిక పరిజ్ఞానికీ వాజ్‌పేయి అత్యంత ప్రాధాన్యతనిచ్చారని, 'జై కిసాన్', 'జై జవాన్'కు తోడుగా 'జై విజ్ఞాన్' అన్న నినదించారని వివరించారు. దౌత్య సంబంధాలపైనా తనదైన ముద్ర వేశారని, అమెరికా అధ్యక్షులు బిల్ క్లింటన్, బుష్ జూనియర్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమీర్ పుతిన్‌తో వాజ్‌పేయికి మంచి సాన్నిహిత్యం ఉందని డా॥ లక్ష్మణ్ అన్నారు.

వాజ్‌పేయి విలువలకు కట్టుబడిన నేతగా అభివర్ణించారు. ఒక్క ఓటు తక్కువ ఉన్న కారణంగా ప్రధానమంత్రి పదవిని తృణప్రాయంగా త్యజించి విలువలకే పెద్దపీట వేశారన్నారు. హిమాలయాల ఎత్తున ఉన్న ఆయన విలువలు.. అధికారమే లక్ష్యంగా విలువలకు తిలోదకాలిస్తున్న నేటి తరానికి ఆదర్శమని కొనియాడారు. అటల్‌జీ అజాత శత్రువు అని, అన్ని పార్టీల్లోనూ ఆయనకు మిత్రులు ఉన్నారని, ప్రత్యర్థులతోనూ ప్రశంసలు అందుకున్నారని తెలిపారు. వాజ్‌పేయి నాయకత్వ లక్షణాలను గుర్తించిన భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ఆయనను కాబోయే ప్రధానిగా అభివర్ణించారని చెప్పారు. ప్రత్యర్థి పార్టీలకు చెందిన మాజీ ప్రధానులు సైతం ఆయన ఉన్నత విలువలకు ముగ్ధులయ్యారన్నారు. వాజ్‌పేయిని పి.వి.నరిసింహా రావు గురువుగా భావించేవారని, మన్మోహన్ సింగ్ భీష్మపితామహుడిగా కీర్తించారని గుర్తు చేశారు. అటల్‌జీ ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డునూ సొంతం చేసుకున్నారని తెలిపారు. ప్రధానిగా, ప్రతిపక్ష నేతగా పార్లమెంటులో బయటా ఆయన ప్రసంగాలు అందరినీ ఉత్తేజితులను చేసేవన్నారు. ఆయన వాగ్ధాటికి అన్ని పార్టీల సభ్యులు ముగ్ధులయ్యేవారని గుర్తు చేశారు.

అటల్ బిహారీ వాజ్‌పేయి 1924 డిసెంబర్ 25న మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో ఓ మధ్యతరగతి బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారని తెలిపారు. వాజ్‌పేయి తొలిసారి 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో పోరాడితే,

అందుకు బ్రిటీష్ ప్రభుత్వం 23 రోజులు ఆయనను జైల్లో పెట్టిందని తెలిపారు. ఆర్యసమాజ్ యువజన విభాగం ప్రధాన కార్యదర్శిగా చేసారని, 1939లో ఆరెస్సెస్‌లో చేరారని, 1947లో పూర్తి స్థాయి ప్రచారక్‌గా పనిచేశారని తెలిపారు. 1951 భారతీయ జనసంఘ్ వ్యవస్థాపక సభ్యుల్లో ఒకరిగా పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయకు అనుచరుడిగా ఉండేవారన్నారు. ఇందిరాగాంధీ ప్రవేశపెట్టిన ఎమర్జన్సీ కాలంలో అనేకమంది విపక్ష నాయకులతో పాటు వాజ్‌పేయి కూడా అరెస్టయ్యారన్నారు. వాజ్‌పేయి 1957లో మొదటిసారి లోక్‌సభకు బలరాంపూర్ నుంచి ఎన్నికయ్యారని, 1968-73 కాలంలో భారతీయ జనసంఘ్ అధ్యక్షుడిగా పనిచేసారని, 3వ, 9వ లోక్‌సభ మినహాయిస్తే 2004 వరకు ప్రతి సభలో ఆయన ఉన్నారని, ఆ సందర్భంలో రాజ్యసభ సభ్యుడుగా ఉన్నారని తెలిపారు. 1977లో జనతా ప్రభుత్వంలో మొరార్జీ దేశాయ్ హయాంలో విదేశీ వ్యవహారాల మంత్రిగా చేసి కితాబందుకున్నారని తెలిపారు. ఆ సమయంలో అనేక సంస్కరణలు తీసుకొచ్చి, గల్ఫ్ దేశాల్లో పని కోసం వెళ్లేవారికి పాస్‌పోర్టులు, వీసాలు ఇప్పించారని అన్నారు. విదేశీ వ్యవహారాల మంత్రిగా ఆయన ఐక్యరాజ్యసమితి సర్వ ప్రతినిధి సభలో హిందీలో ప్రసంగించిన మొట్టమొదటి వ్యక్తిగా ఘనత వహించారన్నారు.

1980-86 జనసంఘ్ బిజెపిగా మారాకా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులుగా ఉన్నారని, 1982లో ఇద్దరు లోక్‌సభ సభ్యులున్న పార్టీని అధికారంలోకి తీసుకురావడంలో అటల్‌జీ కీలక పాత్ర అని డా॥ లక్ష్మణ్ స్పష్టం చేశారు. ఎల్.కె.అద్వానీతో కలిసి వాజ్‌పేయి అనేక రాజకీయ ఉద్యమాలు చేశారన్నారు. వాజ్‌పేయి, అద్వానీలు బిజెపికి రామలక్ష్మణులని స్పష్టం చేశారు. దేశంలో కాంగ్రెస్‌కు పటిష్టమైన ప్రత్యామ్నాయాన్ని నిర్మించిన ఘనత అటల్‌జీకి దక్కుతుందన్నారు. ప్రస్తుత బిజెపిలో ముఖ్య నాయకులందరూ ఆయన శిష్యులే అని తెలిపారు. ఆజన్మ బ్రహ్మచారిగా దేశం కోసం సర్వస్వం త్యాగం చేశారని కొనియాడారు.

1996లో తొలిసారి భారత ప్రధానిగా పని చేశారని, 1998-99లో రెండోసారి 13 నెలలు పాలించారన్నారు. ఆ 13 నెలల్లో అనేక కీలక నిర్ణయాలు తీసుకున్నారన్నారు. 1999లో పోఖ్రాన్ అణు పరీక్షలు నిర్వహించి ప్రపంచంలో భారత సత్తాను మరోసారి చాటారన్నారు. వాజ్‌పేయికి నాట్యం, లలిత కళలు, సంగీతం, కవిత్వం అంటే చాలా ఇష్టమని, ప్రకృతి ప్రేమికుడని చెప్పారు. "రాష్ట్రధర్మ", "పాంచజన్య", "స్వదేశ్", "వీర్ అర్జున్" వంటి పత్రికలలో పనిచేశారన్నారు. 1991-2004లో హైదరాబాద్‌లో జరిగిన బిజెపి జాతీయ కార్యవర్గ సమావేశాల్లో వాజ్‌పేయి పాల్గొన్నారని గుర్తు చేసుకున్నారు. హైదరాబాద్ బార్కాస్‌లో సమావేశంలో ప్రసంగించి ముస్లింలను విశేషంగా ఆకట్టుకున్నారన్నారు. వాల్మీకీ అంబేద్కర్ అవాస్ యోజనను హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో ప్రారంభించారన్నారు.

వాజ్‌పేయికి అనేక అవార్డులు వరించాయని, 2014లో అత్యున్నత పౌర పురస్కారం 'భారతరత్న' అవార్డుతో ఆయనను మోదీ సత్కరించిందని తెలిపారు. ప్రస్తుత ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో వాజ్‌పేయికి అవినాభావ సంబంధం ఉందని.. ప్రతి సందర్భంలో మోదీని వెన్ను తట్టి పోత్సహించే వారని తెలిపారు. మోదీ బిజెపి కార్యాలయ కార్యదర్శిగా ఉన్నప్పటి నుంచి ఇరువురి మధ్య సాన్నిహిత్యం ఏర్పడిందన్నారు. మోదీ ప్రతి అంశాన్ని వాజ్‌పేయి దృష్టితో చూసి ఆచరిస్తారన్నారు. డిసెంబర్ 25న వాజ్‌పేయి జన్మదినాన్ని 'సుపరిపాలనా దినం'గా ప్రకటించి నరేంద్రమోదీ ఆయనపై అభిమానాన్ని చాటుకున్నారని తెలిపారు.

ఎందరికో ప్రేరణ నింపిన స్ఫూర్తి ప్రదాత వాజ్‌పేయి మృతికి సంతాపంగా బిజెపి తెలంగాణ ఏడు రోజులు సంతాప దినాలుగా పాటిస్తుందన్నారు. తెలంగాణలో రాష్ట్ర స్థాయి నుంచి గ్రామస్థాయి వరకు ఏడు రోజుల పాటు వాజ్‌పేయిని స్మరించుకుంటూ బిజెపి అనేక కార్యక్రమాలు చేపడుతుందన్నారు. ఈ సందర్భంగా వాజ్‌పేయి ప్రసంగాలను, వారి జీవితానికి సంబంధించిన ముఖ్య ఘట్టాలను ప్రదర్శిస్తామని తెలిపారు. 'సామాజిక్ న్యాయ్ పర్వ్', 'మార్పు కోసం బిజెపి ఉద్యమం' లాంటి పార్టీ అధికారిక కార్యక్రమాలను వాయిదా వేశామన్నారు. పార్టీ భవిష్యత్తు కార్యక్రమాలను త్వరలో ప్రకటిస్తామని డా॥ కె.లక్ష్మణ్ చెప్పారు.

**కార్యాలయ కార్యదర్శి**